

ఫలించిన డిజిటల్ బోధన

దుద్యాల్ మండలం చెట్టుపల్లితండా సమీపంలోని కేజీబీవీ విద్యార్థినులు పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటారు. 8లో▸



విద్యార్థుల భవిష్యత్‌కు కృషి

విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 8లో▸



మంజూరయ్యేనా..?

ప్రభుత్వ నిబంధనలతో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

బ్రిడ్జి పనులను సత్వరం పూర్తి చేయండి

పంచాయతీ రాజ్ ఎస్‌ఈ శ్రీనివాస్‌రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న పంచాయతీరాజ్ ఎస్‌ఈ శ్రీనివాస్‌రెడ్డి

తాండూరు రూరల్: కాగ్నానదిపై చేపట్టిన హైలెవల్ బ్రిడ్జి పనుల్లో వేగం పెంచి సకాలంలో పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఎస్‌ఈ శ్రీనివాస్‌రెడ్డి కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మంగళవారం మండలంలోని బొంకూర్ – బిజ్వార్ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రూ.4.85 కోట్లతో బ్రిడ్జి పనులు జరుగుతున్నాయని వివరించారు. వేసవికాలం ముగిసేలోపు పనుల్లో పురోగతి సాధించాలన్నారు. బొంకూర్ – రుక్మాపూర్ గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.56కోట్లు మంజూరయ్యాయని వెంటనే పనులను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. రూ.1.75 కోట్లతో చేపట్టిన అల్లాపూర్ – సిరిగిరిపేట్ రోడ్డు పనులను, రూ.1.25 కోట్లతో చేపట్టిన సిరిగిరిపేట్ – సంకిరెడ్డిపల్లి రోడ్డు పనులను సత్వరం పూర్తి చేయాలన్నారు. అనంతరం తాండూరులోని పంచాయతీరాజ్ ఈఈ కార్యాలయంలో పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ తాండూరు డివిజన్ ఈఈ సత్యనారాయణరెడ్డి, డీఈ నాగభూషణం, ఏఈ నందిని తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

డీఈఓ రేణుకాదేవి



చిన్నారులతో మాట్లాడుతున్న డీఈఓ రేణుకాదేవి

మోమిన్‌పేట: మండలంలోని ఎన్కతల ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని మంగళవారం జిల్లా విద్యాధికారి రేణుకాదేవి సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లలకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమం గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వేసవి శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్న శిక్షణ ఫౌండేషన్ వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లేశం, ప్రధానోపాధ్యాయుడు గౌరీశంకర్, రమేష్, పద్మ, శ్రీనివాస్‌రెడ్డి, రజిని, రాజు, పాఠశాల చైర్‌పర్సన్ కళావతి తదితరులు పాల్గొన్నారు.

భూ భారతికి 24 దరఖాస్తులు

పరిశీలించిన ఆర్డీఓ వాసుచంద్ర



కాచారంలో రైతులు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్డీఓ వాసుచంద్ర

ధారూరు: మండలంలోని అంపల్లి, క్యాచారం గ్రామాల్లో మంగళవారం భూ భారతి అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ రెండు గ్రామాల నుంచి భూ సమస్యల పరిష్కారం కోసం 24 దరఖాస్తులు వచ్చాయి. కాచారం గ్రామంలో నిర్వహించిన సదస్సులో వికారాబాద్ ఆర్డీఓ వాసుచంద్ర పాల్గొని రైతులు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు శ్రీనివాస్, సాజిదాబేగం, డీటీ విజయేందర్, ఆర్‌ఐ స్వప్న, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. బుధవారం అల్లాపూర్, అల్లీపూర గ్రామాల్లో భూ భారతి సదస్సులు నిర్వహించనున్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి

కొత్తూరు: పంచాయతీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ విభాగం పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మె నోటీసును ఎంపీడీఓ అరుంధతికి అందజేశారు. అనంతరం నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీ కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, కార్మికులు సురేష్, దేవయ్య పాల్గొన్నారు.

ఆఫీసు ఇక్కడ | సేవలు అక్కడ

- నేటికీ ఖైరతాబాద్ నుంచే కార్యకలాపాలు
- అధికారులకు తప్పని ఫైళ్ల మోత
- ఓ అధికారి తతంగం వల్లే ఈ పరిస్థితి

రెండేళ్లు కావస్తున్నా ఏర్పాటు కాని పీఆర్ ఎస్‌ఈ కార్యాలయం



వికారాబాద్‌లోని పీఆర్ ఈఈ కార్యాలయం

వికారాబాద్: జిల్లాకు పీఆర్ ఎస్‌ఈ కార్యాలయం మంజూరై రెండేళ్లు కావస్తున్నా స్థానికంగా సేవలు మాత్రం అందడం లేదు. నేటికీ రంగారెడ్డి నుంచే కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. 2023 ఆగస్టులో అప్పటి ప్రభుత్వం జిల్లాకు పంచాయతీరాజ్ ఎస్‌ఈ కార్యాలయం తోపాటు ఎస్‌ఈ, ఈఈ, డీఈ పోస్టులను మంజూరు చేసింది. అప్పటిదాకా రంగారెడ్డి జిల్లా ఖైరతాబాద్ కార్యాలయం నుంచి సేవలు కొనసాగేవి. జిల్లాకు నూతన కార్యాలయం మంజూరు కావడంతో అప్పటి వరకు పని ఒత్తిడితో సతమతమవుతూ వచ్చిన అధికారులు ఇక కష్టాలు తీరుతాయని భావించారు. అయితే వారి ఆశలు అడియాశలయ్యాయి. కొత్తగా ఏర్పాటు చేసే ఎస్‌ఈ కార్యాలయం ద్వారా వికారాబాద్ జిల్లాతోపాటు పొరుగు జిల్లా అయిన నారాయణ్‌పేట్‌కు కూడా సేవలందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అప్పటి జిల్లా మంత్రి మహేందర్‌రెడ్డి చేతులమీదుగా వికారాబాద్‌లో ఎస్‌ఈ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఇంత వరకు బాగానే ఉన్నా సేవలు మాత్రం నేటికీ స్థానికంగా అందుబాటులోకి రాలేదు. ఇంత జరుగుతున్నా జిల్లా ప్రజాప్రతినిధులు నోరు మెదపకపోవడం విమర్శలకు తావిస్తోంది.

నేటికీ రంగారెడ్డి నుంచే..

జిల్లా కేంద్రం వికారాబాద్‌లో పీఆర్ ఎస్‌ఈ కార్యాలయం ప్రారంభమై రెండేళ్లు పూర్తయినా సేవలు అందుబాటులోకి రాకపోవడానికి ఆ శాఖలో పని చేస్తున్న ఓ ఉన్నతాధికారే కారణమనే విమర్శలు ఉన్నాయి. వికారాబాద్‌లో ఎస్‌ఈ కార్యాలయం ప్రారంభం కాకుండా సూపరింటెండెంట్ రాకుండా పావులు కదుపుతున్నట్లు తెలిసింది. ఎప్పటిలాగే రంగారెడ్డి జిల్లా(ఖైరతాబాద్) నుంచే వికారాబాద్ జిల్లా సేవలు కొనసాగేలా పథకం వేసినట్లు సమాచారం. జిల్లా ఏర్పాటైంది మొదలు ఈఈ వికారాబాద్‌లోనే సేవలందిస్తూ వచ్చారు. ఎస్‌ఈ పోస్టు, కార్యాలయం మంజూరయ్యాక కూడా ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా ఉంటూ వచ్చారు. నేటికీ వికారాబాద్, తాండూరు ఈఈ కార్యాలయాలు, ఇతర సబ్ డివిజన్లకు చెందిన ఫైళ్లను ఖైరతాబాద్‌కే తెప్పించుకొని సంతకాలు పెట్టి పంపిస్తున్నారు.

జిల్లాకు మంజూరైన కార్యాలయాలు

జిల్లాకు ఎస్‌ఈ కార్యాలయంతో పాటు తాండూరుకు ఈఈ కార్యాలయం, క్వాలిటీ కంట్రోల్ కార్యాలయం మంజూరయ్యాయి. 2023 వరకు వికారాబాద్‌లో మాత్రమే క్వాలిటీ కంట్రోల్ కార్యాలయం ఉండేది. ఆ తర్వాత తాండూరుకు అదనంగా మరో కార్యాలయాన్ని మంజూరు చేశారు. గతంలో వికారాబాద్‌లోని నాలుగు మండలాలకు కలిపి ఒక్కటే సబ్‌డివిజనల్ కార్యాలయం ఉండేది. రెండేళ్ల క్రితం వికారాబాద్, ధారూరు మండలాలకు కలిపి ఓ సబ్‌డివిజన్ కార్యాలయం, మోమిన్‌పేట, తాండూరు మండలాలకు కలిపి మరో సబ్ డివిజనల్ కార్యాలయాన్ని మంజూరు చేశారు. వికారాబాద్ సబ్‌డివిజన్ నుంచి విడిపోయిన మోమిన్‌పేట, నవాబుపేటను ప్రత్యేక సబ్‌డివిజన్‌గా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వీటి సేవలన్నీ స్థానికంగా కొనసాగుతున్నాయి. కలెక్టరేట్‌లో పీఆర్ ఎస్‌ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేసే వెసులుబాటు ఉన్నా జిల్లా ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి జిల్లా కేంద్రం నుంచి పీఆర్ ఎస్‌ఈ కార్యాలయ సేవలు అందేలా చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

9నుంచి ప్రత్యేక లోక్ అదాలత్

- చెక్ బౌన్స్ కేసులను రాజీ చేసుకోండి
- కొడంగల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీరాం



కొడంగల్: కొడంగల్ కోర్టు పరిధిలో గతంలో నమోదైన చెక్ బౌన్స్ కేసులను రాజీ చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి బి.శ్రీరాం సూచించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు జూన్ 9నుంచి 14వ తేదీ వరకు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. రూ.5 లక్షల లోపు చెక్కులు బౌన్స్ అయిన వాటికి గతంలో కేసులు నమోదు అయినట్లు చెప్పారు. ఈ కేసులను ప్రత్యేక లోక్ అదాలత్‌లో రాజీ కుదుర్చుకోవాలన్నారు. చెక్ బౌన్స్ విషయంలో కాంప్రమైజ్ ఫీజు తీసుకోవడం లేదన్నారు. ఇరువర్గాల అంగీకారం మేరకు కేసులను పరిష్కరించనున్నట్లు చెప్పారు. బ్యాంకులకు సంబంధించిన చెక్ బౌన్స్ కేసుల్లో కూడా రాజీ చేసుకునే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో మొదటిసారి చెక్ బౌన్స్ కేసులను పరిష్కరించడానికి ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గణాంకాల ప్రకారం రాష్ట్రంలోని వివిధ కోర్టుల్లో మొత్తం 89,900 చెక్ బౌన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. గతంలో హైదరాబాద్ డివిజన్ పరిధిలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 3,107 చెక్ బౌన్స్ కేసులకు పరిష్కారం లభించినట్లు చెప్పారు. రాజీమార్గం ద్వారానే ఇరు వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. జూన్ 14వ తేదీ వరకు జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో మరిన్ని కేసులను పరిష్కరించనున్నట్లు చెప్పారు. సివిల్, క్రిమినల్ కేసులకు రాజీ మార్గంలో పరిష్కారం లభిస్తుందన్నారు. భూములు, గట్టు పంచాయితీలు, ఆర్థిక విషయాల్లో సివిల్, క్రిమినల్ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నట్లు చెప్పారు. ప్రత్యేక లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

రైల్వే ప్రైవేటీకరణను విరమించుకోవాలి

- సీఐటీయూ నేతల డిమాండ్
- తాండూరు రైల్వే స్టేషన్ ఎదుట నిరసన కార్యక్రమం



తాండూరు రైల్వే స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

తాండూరు టౌన్: రైల్వే ప్రైవేటీకరణను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో తాండూరు రైల్వే స్టేషన్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు కే శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దేశ సంపద దోచి పెట్టేందుకే కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఇందులో భాగంగానే రైల్వేను ప్రైవేటీకరిస్తోందని దుయ్యబట్టారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని రైళ్లలో సౌకర్యాలను మెరుగు పరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చంద్రయ్య, సురేష్, మానెప్ప,సంజీవ్,అంజయ్య, బాలస్వామి, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ సమక్షంలో బాలుడిని దత్తత తీసుకుంటున్న ఇటలీ దంపతులు

చట్టపరంగా దత్తత తీసుకోవాలి

- కలెక్టర్ ప్రతీక్ జైన్
- ఇటలీ దంపతులకు బాలుడి అప్పగింత

అనంతగిరి: పిల్లలు లేని దంపతులు చట్టపరంగా దత్తత తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇంటర్ కంట్రీ(ఇటలీ) దంపతులకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని వికారాబాద్ శిశు గృహలో పెరుగుతున్న ఎనిమిది సంవత్సరాల అబ్బాయిని దత్తత ఇచ్చారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టపరంగా కాకుండా పిల్లలను తీసుకుంటే నేరమని, పిల్లలను దత్తత తీసుకోవాలంటే జిల్లా సంక్షేమ శాఖ పరిధిలోని శిశు గృహ వికారాబాద్‌లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిని జయసుధ, సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ వెంకటేశం, టీఆర్‌బీ కోఆర్డినేటర్ కాంతారావు, డీసీపీఓ శ్రీకాంత్, శిశు గృహ మేనేజర్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

రసాయనాలతో పంటలకు నష్టం

- ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త లక్ష్మణ్

కొడంగల్: పంటల సాగులో రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త లక్ష్మణ్, తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త టి.రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని పర్సాపూర్ గ్రామ రైతు వేదికలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు అధిక మొత్తంలో యూరియా వాడుతున్నారని అన్నారు. యూరియా వాడకాన్ని తగ్గించాలని సూచించారు. యూరియా అధికంగా వాడటం వల్ల నేల సారవంతం దెబ్బతిని ఉత్పాదకత తగ్గుతుందన్నారు. సాగు ఖర్చులు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు. రసాయనాల వాడకం వల్ల పంటలకు మేలు చేసే వానపాములు, మిత్ర పురుగులు చనిపోతున్నాయని తెలిపారు. అనంతరం కొడంగల్ పీఏసీఎస్ చైర్మన్ కటుకం శివకుమార్ గుప్తా, కొడంగల్ ఏఎంసీ చైర్మన్ అంబయ్య గౌడ్ మాట్లాడారు. రైతులు సేంద్రియ ఎరువులను వాడి ప్రకృతిని కాపాడుకోవాలని సూచించారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు సూచనలు తప్పక పాటించాలన్నారు. పర్యావరణం దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందని పేర్కొన్నారు. సాగునీటిని ఆదా చేసి భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. పంటలకు ఎంత నీటి అవసరం ఉంటే అంతే నీటిని వినియోగించుకోవాలన్నారు. ఆ తర్వాత వ్యవసాయ ఉప సంచాలకులు శంకర్ రాథోడ్ మాట్లాడుతూ.. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేప్పుడు రైతులు తప్పని సరిగా రసీదులు పొందాలన్నారు. రసీదులు ఉంటే కష్టకాలంలో నష్ట పరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు. మండల వ్యవసాయాధికారి తులసీ మాట్లాడుతూ.. పంట మార్పిడి విధానం పాటించాలని సూచించారు. పంట మార్పిడితో భూసారం పెరుగుతుందన్నారు. పురుగులు, తెగుళ్ల నుంచి పంటలకు స్వీయ రక్షణ లభిస్తుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త లక్ష్మణ్

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు దిశానిర్దేశం



అనంతగిరి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అధికారులతో చర్చిస్తున్న గౌతమ్

అనంతగిరి: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా జాబితాను రూపొందించాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, ధ్రువీకరణ ప్రక్రియపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన పేదలకు చెందాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీ ద్వారా వచ్చిన జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలించి కుటుంబాల స్థితిగతులను తెలుసుకొని పారదర్శకంగా జాబితాను రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ సుధీర్, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీఎస్‌హెచ్‌ఓ సత్తార్, హౌసింగ్ డీఈ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

వేగం పెంచండి

కొడంగల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎండీ వీపీ గౌతమ్ ఆదేశించారు. మంగళవారం ఆయన కొడంగల్‌లో పర్యటించారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్‌ను పరిశీలించారు. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం లబ్ధిదారుల జాబితాను పరిశీలించారు. అర్హులను గుర్తించి వెంటనే గ్రౌండింగ్ చేయాలన్నారు. ఇంటి నిర్మాణంలో పారదర్శకంగా వ్యవరించాలన్నారు. అర్హులైన పేదలకు అన్యాయం జరుగకుండా చూడాలన్నారు. ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ ఉషశ్రీ, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే కట్టుకోవాలి

దుద్యాల్: ప్రభుత్వ నిబంధనల మేరకే ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎండీ గౌతమ్ అన్నారు. మంగళవారం మండలంలోని సంగాయిపల్లిలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంగాయిపల్లికి 62 ఇళ్లు మంజూరు కాగా 12 మంది బేస్‌మెంట్ పనులు పూర్తి చేసుకున్నారని తెలిపారు. ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున అందజేసినట్లు వివరించారు. మరో 22 ఇళ్లు పునాది దశలో ఉన్నట్లు తెలిపారు. 28 ఇళ్ల నిర్మాణానికి ముగ్గుపోసినట్లు వివరించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ చందర్ నాయక్, డీఎల్‌పీఓ శంకర్ నాయక్, దుద్యాల్, కొడంగల్ ఎంపీడీఓలు మహేష్‌కుమార్, ఉషా శ్రీ, ఎంపీఓ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

తాండూరు ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలక్ష్మి



బషీరాబాద్: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని తాండూరు ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. వాటిని ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం ఆమె స్థానికంగా విలేకర్లతో మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు ఆడపిల్లలకు 18 ఏళ్లు నిండక ముందే పెళ్లిల్లు చేయడానికి ముహూర్తాలు పెడుతున్నారన్నారు. అలాంటి పెళ్లిళ్లపై అంగన్‌వాడీ టీచర్లతో ప్రత్యేక నిఘా పెట్టినట్లు వెల్లడించారు. తాండూరు నియోజకవర్గంలో నెల రోజులుగా మొత్తం తొమ్మిది చైల్డ్ మ్యారేజీలను అడ్డుకున్నట్లు తెలిపారు. మరో రెండు వివాహాల విషయంలో పోలీసు కేసులు పెట్టినట్లు చెప్పారు. 2006 బాల్య వివాహ నిషేధ చట్టం ప్రకారం రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తామని హెచ్చరించారు. బాల్య వివాహాలతో ప్రభుత్వం నుంచి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద వచ్చే ఆర్థిక సాయం అందదని చెప్పారు. దీనిపై ప్రజల్లో చైతన్యం కల్పించడానికి గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎక్కడైన బలవంతంగా బాల్య వివాహం చేయాలని నిర్ణయిస్తే టోల్ ఫ్రీ నంబర్స్ 1098 లేదా 181 కాల్ చేసి సమాచరం ఇవ్వాలని సూచించారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి



ఎల్లమ్మ తండాలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ తదితరులు

- కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

మంచాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని ఎల్లమ్మ తండా గ్రామంలో ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలను కలిశారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. సీపీఎం పోరాటాల ఫలితంగానే అప్పటి కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం తీసుకొచ్చిందన్నారు. నేటి ప్రభుత్వాలు ఉపాధి హామీ అమలులో విఫలమవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా దినసరి కూలీ.600కు పెంచి ఏడాదికి 200 రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని ఎత్తివేసే కుట్రలో భాగంగా అలవెన్స్‌లు ఇవ్వడం లేదన్నారు. ఉపాధిహామీ కూలీలకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు, టీఏ, ఏపీఓలకు సైతం నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వలేని దయనీయ పరిస్థితిలో ప్రజాపాలన సాగుతోందని ఆరోపించారు. ఆదివారం సైతం పనులు చేయిస్తూ శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ నెల 30న కార్మికుల హక్కులు, వారి సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం ఉంటుందని కార్మికులు, కర్షకులు కదలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య మాట్లాడుతూ.. సీపీఎం పేదల పక్షాన పోరాడుతుందన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు, సంక్షేమ పథకాలు అందాలంటే సీపీఎం పోరాటాల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జంగయ్య, జిల్లా నాయకులు సామేల్, జగదీష్, ఇ.నర్సింహ,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంజయ్య, కె.జగన్, నాయకులు కె. శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, శ్యాం సుందర్, పి.జగన్, జంగయ్య, యాదయ్య, బుగ్గ రాములు, శేఖర్, విజయ్, ఐలయ్య, వెంకటేష్, మంతని జంగయ్య, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వృద్ధుల బాధ్యత వారసులదే

సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మధుసూదనరావు

మొయినాబాద్‌రూరల్: వయోవృద్ధుల పోషణ, సంక్షేమం చట్టపరంగా వారి పిల్లలే చూసుకోవాలని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మధుసూదనరావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంజనాదేవి గార్డెన్స్‌లో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశాన్ని డాక్టర్ వి.పాండుగౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మధుసూదనరావు, అనంతరెడ్డిలు హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం-2007, నియమావళి రూల్స్ 2011ను వివరించారు. డాక్టర్ పాండుగౌడ్ మాట్లాడుతూ.. ఇండియన్స్ రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా సీనియర్ సిటిజన్స్‌కు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అందరం కలిసి పేద కుటుంబాల ప్రజలకు సహాయం అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రతి గ్రామంలో సంఘాలు ఏర్పాటు చేయాలని చట్టం 2007 అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఉపాధ్యక్షులు సత్తయ్య, నాయకులు ఉపేందర్‌రెడ్డి, అనంతరెడ్డి, భాస్కర్, రమేశ్, చంద్రలింగం, సంగరి మల్లేశ్, గోపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, కిషన్, రామ్మోహన్, సుగుణాకర్‌రావు, సయ్యాజీరావు, బల్వంత్ రెడ్డి, కృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్‌పై దాడి అమానుషం

తీవ్రంగా ఖండించిన గెజిటెడ్ అధికారుల సంఘం



స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్ బుద్ధ ప్రకాష్‌కు వినతిపత్రం అందజేస్తున్న సబ్ రిజిస్ట్రార్లు

ఇబ్రహీంపట్నం రూరల్: విధి నిర్వహణలో ఉన్న పెద్దఅంబర్‌పేట్ సబ్‌రిజిస్ట్రార్‌పై దాడి చేయడం అమానుషమని గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామారావు, కార్యదర్శి శ్రీనేష్ కుమార్ నోరీలు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ సెక్రెటరీ బుద్ధ ప్రకాష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సబ్‌రిజిస్ట్రార్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిని వెంటనే జైలుకు పంపించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ విధి నిర్వహణ ప్రకారం పని చేస్తారన్నారు. అధికారులు తప్పు చేస్తే ఫిర్యాదులు చేయాలి కాని, భౌతిక దాడులకు పాల్పడటం తగ దని హెచ్చరించారు. గెజిటెడ్ ఉద్యోగులు కలెక్టరేట్ నందు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపినట్లు చెప్పారు. దోషులను కఠినంగా శిక్షించే వరకు ఊరుకోబోమని తెలిపారు. కార్యక్రమంలో స్టాంప్స్, సబ్‌రిజిస్ట్రార్ సంఘం బాధ్యులు సహదేవ్, స్తితి ప్రజ్ఞ, వెంకటేష్, నూతనగంటి వెంకట్, శాంతి శ్రీ, అలివేలు, లక్ష్మణ్ స్వామి, సుజాత, సైదమ్మ, నాగేశ్వర్‌రావు, సీడీపీఓ, ఈఈఎస్, డీఈఈఎస్, కలెక్టరేట్ గజిటెడ్, నాన్ గెజిటెడ్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

పెద్దమంగళారంలో భారీ చోరీ

మొయినాబాద్: గుర్తుతెలియని దుండగులు ఇంట్లో బీరువా తాళాలు పగులగొట్టి బంగారం, నగదు దోచుకెళ్లారు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దమంగళారంకు చెందిన అప్పల హరీష్‌యాదవ్ సోమవారం రాత్రి 9 గంటలకు మొయినాబాద్‌లో ఉన్న తన అన్న సురేష్ ఇంటికి వెళ్లాడు. రాత్రి ఆలస్యం కావడంతో అక్కడే ఉన్నాడు. మంగళవారం ఉదయం 7 గంటలకు తిరిగి వెళ్లే సరికి ఇంటి తాళం కనిపించలేదు. లోపలికి వెళ్లి చూశాక బీరువా తాళాలు పగులగొట్టి తెరిచి ఉంది. అందులో ఉన్న 26 తులాల బంగారం, రూ.2.50 లక్షల నగదు కనిపించలేదు. రాత్రి సమయంలో దుండగులు తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి పోలీసులు వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు.

ఫలించిన డిజిటల్ బోధన

- పది ఫలితాల్లో కేజీబీవీ విద్యార్థినుల సత్తా
- నూరుశాతం ఉత్తీర్ణత సాధించిన బాలికలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు



విజయ సంకేతం చూపుతున్న విద్యార్థినులు

దుద్యాల్: పదో తరగతి ఫలితాల్లో పేదింటి బిడ్డలు సత్తా చాటారు. మండల పరిధిలోని చెట్టుపల్లితండా సమీపంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థినులు 100 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలోనే ఆదర్శంగా నిలిచారు. బాలికల సాధనతో పాటు అత్యాధునిక వసతుల కల్పన ఏర్పాటుతో ఉత్తమ ఫలితాలు వచ్చాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి కేజీబీవీలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతులు విద్యార్థినులకు ఎంతగానో తోడ్పడ్డాయి. తరగతి గదిలో పాఠాలు బోధించిన తర్వాత ప్రత్యేకంగా డిజిటల్ క్లాసులు సైతం నిర్వహించేవారు. అర్థంకాని అంశాలను ప్రత్యేక తరగతిలో బాలికలు నివృత్తి చేసుకునేవారు. దీనికి తోడు స్టడీ అవర్‌లు నిర్వహించి కఠోర సాధన చేసేవారు. వాటి ఫలితంగానే మంచి రిజల్ట్స్ వచ్చాయని తెలుపుతున్నారు.

ఉపాధ్యాయుల సూచనలు

ఉపాధ్యాయుల మార్గదర్శకాలను అనుసరించిన విద్యార్థినులు ఉత్తమ మార్కులతో పాటు 100 శాతం ఉత్తీర్ణత సాధించి ఖ్యాతి గడించారు. 44 మంది బాలికలు పదో తరగతి పరీక్షలకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణత పొందారు. అత్యధికంగా 494 మార్కులతో సంధ్యారాథోడ్, 480 మార్కులతో అంజలి, పూజ, 475 మార్కులతో తనుజ మెరిశారు. గత సంవత్సరం పది ఫలితాల్లో 97 శాతం ఉత్తీర్ణత సాధించారు. కాగా ఈ సారి మాత్రం దుద్యాల్ మండలంలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలగా ఈ కేజీబీవీ నిలిచింది.



డిజిటల్ బోధన (ఫైల్)

డిజిటల్ క్లాసులతో మేలు



అర్థంకాని పాఠాలను డిజిటల్ క్లాసులో విని పూర్తిగా అవగాహన చేసుకున్నాం. స్టడీ అవర్‌లో ఉపాధ్యాయుల సహాయంతో బాగా చదివే వాళ్లం. అలా చేయడం ఎంతగానో ఉపయోగపడింది. పాఠశాలలో అందరం పాస్ అయినందుకు చాలా ఆనందంగా ఉంది.

– సంధ్యారాథోడ్, విద్యార్థిని, కేజీబీవీ

చెప్పలేని సంతోషం



అమ్మానాన్నలు నా చిన్నప్పుడే చనిపోయారు. బంధువుల దగ్గర ఉండి ప్రాథమిక విద్యను పూర్తి చేశాను. ఉపాధ్యాయుల సహకారంతో కష్టపడి చదివాను. ఉత్తమ విద్యార్థుల్లో నేను ఒకరిని కావడం మాటల్లో చెప్పలేని సంతోషం. ఇంటర్ కూడా కేజీబీవీలోనే చదువుతాను.

– తనుజ, విద్యార్థిని, కేజీబీవీ

అదనపు సమయంతో..



డిజిటల్ బోధన, ప్రత్యేక తరగతులతో 100 శాతం ఉత్తీర్ణత సాధించాం. సాధారణంగా తరగతులు పూర్తయినా తర్వాత సాయంత్రపు స్టడీ అవర్‌లో టెలివిజన్ ద్వారా అర్థంకాని అంశాలను వివరించాం. డిజిటల్‌గా వినడంతో పూర్తిగా అవగాహన చేసుకున్నారు.

– రాధిక, ప్రత్యేకాధికారి, కేజీబీవీ



పరిగి: శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న మాధవి

టైలరింగ్‌తో ఉపాధి

- సత్యసాయి సేవా సమితి స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జ్ మాధవి
- నిరుపేద మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ల అందజేత

పరిగి/ధారూరు: మహిళలు టైలరింగ్ నేర్చుకొని ఆర్థికంగా ఎదగొచ్చని సత్యసాయి సేవా సమితి రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ ఇంచార్జ్ మాధవి పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి సేవా కేంద్రం పరిగిలోని రంగాపూర్‌లో ఉచిత టైలరింగ్ శిక్షణ పొందిన ఐదో బ్యాచ్‌కు మంగళవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ట్రైనింగ్ పూర్తి చేసుకున్న 55 మందికి సర్టిఫికెట్లతో పాటు నిరుపేద కుటుంబాలకు చెందిన ఆరుగురికి కుట్టు మిషన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శిక్షణ తరగతులకు హాజరైన వారికి 65 రోజుల పాటు ఉచిత శిక్షణతో పాటు వసతి, భోజన సౌకర్యం కల్పించామన్నారు. గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పించేందుకు సంస్థ ఆధ్వర్యంలో నిత్యం కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. టైలరింగ్‌తో ఆర్థికంగా ఎదిగేందుకు వీలుంటుందన్నారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న ప్రతిఒక్కరూ మంచి నైపుణ్యులుగా తయారవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్ నాగరాజు, ప్రభాకర్, జిల్లా ఇన్‌చార్జ్ విద్యారాణి తదితరులు పాల్గొన్నారు.

హద్దురాళ్లు పడగొట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోండి

తాండూరు రూరల్: తన పొలంలో ఏర్పాటు చేసిన హద్దురాళ్లను అకారణంగా పగలగొట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని గౌతపూర్ గ్రామానికి చెందిన కొంపల్లి భీమమ్మ పోలీసులను కోరింది. ఈ మేరకు మంగళవారం కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. గౌతపూర్ అనుబంధ గ్రామం గోపన్‌పల్లిలోని సర్వేనంబర్ 1 బై ఆ2లో ఎకర నాలుగు గుంటల పట్టాభూమి భీమమ్మకు ఉంది. ఆ భూమికి పడమర వైపు ఉన్న కదీర్ హుస్సేన్ అనే వ్యక్తి దౌర్జన్యంగా ఆమె పొలంలో పాతిన హద్దురాళ్లను పగలగొట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నాడన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని ఆమె ఎస్ఐకి ఫిర్యాదు చేసింది. ఈ విషయమై ఎస్ఐ విఠల్‌రెడ్డిని వివరణ కోరగా.. ఫిర్యాదుపై విచారణ చేస్తానని తెలిపారు.

ఘనంగా వార్షికోత్సవం

అబ్దుల్లాపూర్‌మెట్: గుంతపల్లిలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆ విద్యాసంస్థల చైర్మన్, ఏపీ మాజీ మంత్రి ముత్తెంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, నవతేజా టెక్నాలజీస్ డైరెక్టర్ ఏరె సంగమ్కర్, అవంతి విద్యాసంస్థల ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రియాంక జ్యోతి ప్రజ్వలన చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు.

సరిహద్దు మాదే తవ్వకాలు ఆపండి

తహసీల్దార్‌కు సాలిండాపూర్‌వాసుల ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న సాలిండాపూర్‌వాసులు

బొంరాస్‌పేట: 'ఈ సరిహద్దు భూమి మాదే, మట్టి తవ్వకాన్ని ఆపేయాలి' అంటూ మండల పరిధిలోని సాలిండాపూర్‌వాసులు మంగళవారం బొంరాస్‌పేట తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ధారూరు మండల సరిహద్దు వద్ద ఉన్న సాలిండాపూర్ సమీపంలోని గుట్ట నుంచి ధారూరు మండలం అంపల్లి గ్రామస్తులు మట్టితవ్వకం పనులు చేపట్టారు. దీనిపై సాలిండాపూర్ గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు. తవ్వకాలను నిలిపేయాలని డిమాండ్ చేయడంతో ఇరు గ్రామాల మధ్య గొడవకు దారి తీసింది. దీంతో సీఐటీయూ నాయకులు చొరవచూపి తహసీల్దార్ పద్మావతికి ఫిర్యాదు చేశారు. సరిహద్దు పంచాయితీ తేల్చేవరకు మట్టితవ్వకాల పనులు ఆపేయాలని కోరారు. దీంతో ధారూరు మండలం అధికారులతో మాట్లాడిన తహసీల్దార్ పనులను నిలిపివేయించారని సాలిండాపూర్‌వాసులు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాకిస్తానీలను పంపించండి



రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ప్రహ్లాదరావు

కుల్కచర్ల: భారతదేశంలో నివసిస్తున్న పాకిస్తానీలను దేశం నుంచి పంపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కరణం ప్రహ్లాదరావు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మతం పేరుతో ఉగ్రదాడులకు పాల్పడుతున్న పాకిస్తానీలను భారతదేశం నుంచి వెంటనే పంపించాలని డిమాండ్ చేశారు. అనుమానాస్పద ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారందరి ధ్రువపత్రాలను పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో కేంద్ర టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు వెంకటయ్య, పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య ముదిరాజ్, నాయకులు జానకీరాంచౌహాన్, అంజిలయ్య, నరేష్, వెంకటేష్, మహేష్, కె.మహేష్, మల్లేశం, హన్మంతు, గాదె మల్లేష్, శివసంతోష్, ధను, ప్రశాంత్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనాలకు మరమ్మతులు

ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులో ఉన్న అంగన్‌వాడీ భవనాలకు మరమ్మతులు చేపట్టాలని జిల్లా సంక్షేమాధికారి శ్రీలత పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ భవనాలకు మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. శాఖలోని పలు అంశాలకు సంబంధించిన రివ్యూ చేపట్టాక అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. పనితీరు మెరుగు పరుచుకోవాలన్నారు. జిల్లాని రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలపడానికి అందరూ నిబద్ధతతో పని చేయాలన్నారు. ముగ్గురు బాల కార్మికులను రక్షించిన నానాజీపూర్ టీచర్ సంధ్యారాణిని అభినందించారు.

విద్యార్థుల భవిష్యత్‌కు కృషి

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



విద్యార్థిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: విద్యార్థుల అభ్యున్నతికి, వారి మంచి భవిష్యత్తు కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మర్పల్లి మండలం బుచ్చన్‌పల్లి గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని బోయిని సాయితన్మయి ఇంటర్ ఫలితాల్లో జిల్లాలో మొదటి ర్యాంకు, రాష్ట్రంలో 3వ ర్యాంకు సాధించింది. దీంతో ఎమ్మెల్యే తన నివాసంలో మంగళవారం విద్యార్థినిని సన్మానించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అందించేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమాలను తీసుకువచ్చిందన్నారు. జిల్లా విద్యార్థి ఇంటర్‌లో రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు సాధించడం ఎంతో గర్వకారణం అన్నారు. ఉన్నత చదువులు చదివి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు, నాయకులు పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

ఆశవర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు అమృత



మెడికల్ ఆఫీసర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశవర్కర్లు

బంట్వారం: ఆశవర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర యూనియన్ కోట్‌పల్లి మండల అధ్యక్షురాలు అమృత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం పలువురు ఆశవర్కర్లతో కలిసి ఆమె కోట్‌పల్లి పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్ మేఘనకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 20న కేంద్ర, రాష్ట్ర ఉద్యోగుల ఫెడరేషన్లు, అసోసియేషన్ల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలన్నారు. ఆశవర్కర్లను మూడో తరగతి ప్రభుత్వ ఉద్యోగాలుగా గుర్తించాలన్నారు. సీనియార్టీ ప్రాతిపదికన ఏఎన్ఎంలుగా పదోన్నతి కల్పించాలన్నారు. అనంతరం 16 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మెడికల్ ఆఫీసర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు విజయ, శోభారాణి, అండాలు, సుమిత్ర, జయమ్మ, సంపూర్ణ, వినోద, లక్ష్మీఇందిరా తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ పనులు ఆపేయండి



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మామిడిపల్లివాసులు

మామిడిపల్లివాసుల నిరసన

- సంఘీభావం ప్రకటించిన నాయకులు

పహాడీషరీఫ్: మామిడిపల్లి గ్రామం 99/1 సర్వే నంబర్‌లో హౌసింగ్ బోర్డు అధికారులు చేపట్టిన ప్రహరీ నిర్మాణ పనులను వెంటనే ఆపేయాలని మాజీ కౌన్సిలర్ ఈరంకి వేణుకుమార్‌గౌడ్, బీజేపీ సీనియర్ నాయకుడు పెరమోని నరేష్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద దీక్ష చేపట్టిన గ్రామస్తులకు సంఘీభావం ప్రకటించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం కోసం మామిడిపల్లి రైతులు వందల ఎకరాల భూములు ఇచ్చారన్నారు. వీరిలో చాలా మందికి పరిహారం ఇవ్వలేదని తెలిపారు. రైతుల నుంచి సేకరించిన కొంత భూమిని టీజీఐఐసీకి కేటాయించారని, అందులో కంపెనీలు పెట్టి స్థానికులకు ఉపాధి కల్పిస్తామని చెప్పారని, ఇప్పటి వరకూ ఆచరణలోకి తేలేదని మండిపడ్డారు. 99/1 సర్వే నంబర్ భూమిలో మల్లన్నస్వామి, కొండ మైసమ్మ, రామాలయం, కాటమయ్యస్వామి, ఎల్లమ్మ దేవాలయాలు ఉన్నాయని తెలిపారు. వీటితో పాటు అంబేద్కర్ విగ్రహం, దోబీఘాట్, క్రీడా మైదానం, శ్మశానవాటిక ఉందన్నారు. వీటిలోకి వెళ్లకుండా చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు అధికారులు చదను పనులు ప్రారంభించారని పేర్కొన్నారు. భూములను త్యాగం చేసిన రైతులతో పాటు గ్రామంలోని నిరుపేదలకు ఈ భూమిలో 60 గజాల ఇంటి స్థలం కేటాయించి, ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ విగ్రహం నుంచి రంగనాయకులస్వామి ఆలయం వెలుపల వరకు ప్రహరీ పనులు నిలిపి వేయాలన్నారు. దాదాపు 20 ఎకరాల స్థలాన్ని గ్రామ అవసరాలకు కేటాయించాలన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా ఈ విషయంలో ప్రభుత్వం స్పందించాలని కోరారు. అనంతరం వీరి దీక్షకు మాజీ కార్పొరేటర్ యాతం పవన్‌కుమార్ యాదవ్ కూడా మద్దతు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు నందీశ్వర్, గుర్జని గణేశ్‌గౌడ్, అర్జున్, పురుషోత్తం, రాజు, లక్ష్మీపతి, నర్సింహ, జగన్, శ్రీకాంత్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

దిగుబడి తగ్గకుండా..

- మేలైన యాజమాన్య పద్ధతులతో వేసవిలోనూ లాభాల పంట
- కృషి విజ్ఞాన కేంద్రం క్రిడా నిపుణుడు జి.శ్రీకృష్ణ





పందిరి విధానంలో తీగజాతి పంట

కందుకూరు: అధిక ఉష్ణోగ్రతలు, పొడి గాలులు, జలవనరులు తగ్గడం, విద్యుత్ సరఫరాలో అంతరాయం వంటి కారణాలతో వేసవి కాలంలో కూరగాయల దిగుబడి ఆశించిన స్థాయిలో ఉండదు. ఫలితంగా రైతులు నష్టపోతుంటారు. ఈ సమస్యలను అధిగమించి, ఎండల్లో కూడా మంచి దిగుబడులు సాధించడానికి మేలైన యాజమాన్య పద్ధతులను పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం క్రిడా నిపుణుడు జి.శ్రీకృష్ణ తెలిపారు. వేసవిలో కూరగాయల సాగుపై ఆయన రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు.

అనువైన పంటలు

టమాటా, వంగ, బెండ, పచ్చి మిర్చి, సొర, కాకర, బీర, కూరదోస, పొట్ల, గోరు చిక్కుడు, చేమ, కంద, ముల్లంగి, తోటకూర, పాలకూర పంటలు వేసవిలో సాగు చేసుకోవచ్చు.

మొక్కల సాంద్రత పెంచడం

- వేసవిలో అధిక ఉష్ణోగ్రతలతో మొక్క పెరుగుదల తక్కువగా ఉండి, పూత, పిందె తగ్గి దిగుబడులు తగ్గుతాయి.
- మొక్కలను తక్కువ దూరంలో నాటుకుని మొక్కల సాంద్రత పెంచాలి. దీంతో విడిగా ఒక్కో మొక్క నుంచి దిగుబడి తగ్గినప్పటికీ, ఎక్కువ మొక్కలు ఉండటంతో మొత్తం విస్తీర్ణంలో దిగుబడి తగ్గకుండా ఉంటుంది. ఇందు కోసం విత్తన మోతాదు పెంచాలి.

ఎరువుల యాజమాన్యం

- సమగ్ర పోషక యాజమాన్యం పాటిస్తే భూభౌతిక లక్షణాలు మారడమే కాకుండా సూక్ష్మపోషకాలు కూడా లభ్యమవుతాయి.
- సేంద్రియ ఎరువులను ఎక్కువగా వాడితే భూమిలో తేమను నిలిపి ఉంచే గుణం పెరగడమే కాకుండా, సూక్ష్మ జీవుల చర్యలు అధికమై మొక్కలకు పోషకాల లభ్యత పెరుగుతుంది.
- జీవన ఎరువులైన అజిటోబాక్టర్, అజోస్పైరిల్లిం, పాస్ఫోబాక్టీరియాను ఎకరానికి 2 కిలోల చొప్పున వాడటంతో సిఫారుసు చేసిన నత్రజని, భాస్వరం ఎరువుల్లో 25 శాతం ఆదా చేయవచ్చు.
- 30, 45, 75 రోజులకు 2శాతం యూరియా ద్రావణాన్ని పిచికారీ చేస్తే నత్రజని ఆదాతో పాటు నీటి ఎద్దడిని తట్టుకునే వీలుంది.
- పొటాష్‌ను సరైన మోతాదులో వాడితే నీటి ఎద్దడిని, చీడపీడలను తట్టుకునే గుణం పెరుగుతుంది.
- 9 కిలోల యూరియాకు ఒక కిలో వేప పిండిని కలిపి వేయాలి. లేదా 25 కిలోల యూరియాకు ఒక కిలో వేప నూనెను కలిపి అరగంట సేపు ఆరబెట్టి పంటకు అందించాలి.
- జింక్, బోరాన్, కాల్షియం, మెగ్నీషియం మొదలైన సూక్ష్మధాతు లోపాలు కనిపించే అవకాశం ఉంది.
- మిరప, చేమ పంటల్లో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ దుక్కిలో వేయాలి లేదా లీటరు నీటికి 2కిలోల జింక్ సల్ఫేట్ కలిపి మిరపలో పూతకు ముందు పది రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.
- 3 గ్రాముల బోరాక్స్‌ను లీటరు నీటికి కలిపి పూత, పిందె సమయంలో వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు స్ప్రే చేయాలి.
- బ్లాజమ్‌ఎండ్ రాట్ అనగా కాయ తొడిమ వద్ద నల్లగా మారే సమస్య నివారణకు కాల్షియం నైట్రేట్ 5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

వేసవి తాపాన్ని తట్టుకునేలా..

- నేల ఉష్ణోగ్రత తగ్గించడానికి వరుసల మధ్య ఎండుగడ్డి, రంపపుపొట్టు, వరి పొట్టు, పశువుల ఎరువు మొదలైనవి పరచాలి.
- టమాటాలో పాక్షికంగా నీడనిచ్చే విధంగా ఆముదం, మొక్కజొన్నలాంటి పంటలను ఉత్తర, దక్షిణ దిశల్లో నాటు కోవాలి. లేదా 35 శాతం షేడ్ నెట్‌లను ఏర్పాటు చేస్తే ఎండ తీవ్రత తగ్గి దిగుబడులు పెరుగుతాయి.
- పండ్ల తోటల్లో సొర, దోస, గుమ్మడి, బెండ, గోరుచిక్కుడు వంటి కూరగాయలను అంతర పంటలుగా సాగు చేసి అధిక ఆదాయాన్ని పొందవచ్చు.
- తుంపర పద్ధతిలో నీరు ఇవ్వడంతో నీటి ఆదాతో పాటు ఎండవేడి తగ్గి మంచి దిగుబడులు పొందవచ్చు.
- సూక్ష్మపోషకాలు, హార్మోన్లు చల్లి పూత రాలడాన్ని అరికట్టాలి. ఫలితంగా మంచి లాభాలు ఆర్జించే అవకాశం ఉంది.